
APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ మంగళవారం 28, జూలై 2026 సంపుటి: 01 సంచిక :61 పేజీలు : 04 వెల: 2-00/-



## తాడిచెర్ల- 2 ప్రాజెక్టు వేగవంతానికి విజ్ఞప్తి

- జంతర్ మంతర్ ఘటనపై తీవ్ర అభ్యంతరం
- విద్యార్థులపై బలప్రయోగంపై ప్రశ్నల వర్షం
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- కేంద్రం నుంచి ఇంకా అధికారిక స్పందన లేదు

న్యూఢిల్లీ, జూలై 27: తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు. ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, గనుల రంగ విస్తరణ, కార్మిక సంక్షేమం వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వ సహకారం కోరుతూ పలు వినతిపత్రాలను సమర్పించారు. మొదట కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయను కలిసి తెలంగాణలో కార్మిక సంక్షేమ కార్యక్రమాల విస్తరణ, ఉపాధి అవకాశాల పెంపు, కేంద్ర పథకాల సమర్థ అమలుకు అదనపు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత శాఖ మంత్రి జయంత్ చౌదరిని కలిసి యువతకు అత్యాధునిక నైపుణ్య శిక్షణ, ఆధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాల ఏర్పాటు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ కార్యక్రమాల విస్తరణపై చర్చించారు. మారుతున్న ఉపాధి అవసరాలకు అనుగుణంగా శిక్షణా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని కలిసి పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి కీలకమైన తాడిచెర్ల-2 బొగ్గు గని ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఎల్‌నినోపై రైతులకు అవగాహన






- ప్రత్యామ్నాయ పంటల సాగుకు సూచన
- అధికారులతో సీఎం సమీక్ష
- ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశం

అమరావతి, జూలై 27 : ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ఏర్పడే వాతావరణ మార్పులపై రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పరిస్థితులను సమీక్షించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ ఏడాది మొత్తం ఎల్‌నినో ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని అంచనాలు ఉన్న నేపథ్యంలో ఇప్పటికే చేపట్టిన చర్యలను మరింత విస్తరించాలని ముఖ్యమంత్రి తెలిపారు. రైతులకు వాతావరణ పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ, అవసరమైన సూచనలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. రైతులకు శాస్త్రీయ సలహాలు అందిస్తూ, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికపై అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో సంభవించే పంట నష్టాలను తగ్గించేందుకు వ్యవసాయ, జలవనరులు, విపత్తు నిర్వహణ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రైతులను అప్రమత్తం చేయాలని చెప్పారు. వాతావరణ హెచ్చరికలు, పంటల నిర్వహణ, నీటి వినియోగం వంటి అంశాలపై రైతులకు సకాలంలో సమాచారం చేరేలా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు.



## భోగాపురం ఏర్పాట్ల సమీక్ష

- బొబ్బిలిలో సమావేశం నిర్వహించిన బీసీ జనార్దన్ రెడ్డి
- విమానాశ్రయ ప్రారంభంపై చర్చ
- ప్రచార కార్యక్రమంలోనూ పాల్గొనడం

బొబ్బిలి, జూలై 27 : ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్న భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ ఏర్పాట్లపై బొబ్బిలిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో పాటు బొబ్బిలి శాసనసభ్యులు ఆర్.వి.ఎస్.కె.కే. రంగారావు (బేబీ నాయన) పాల్గొని ఏర్పాట్ల పురోగతిని సమీక్షించారు. విమానాశ్రయ ప్రారంభోత్సవం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని సమావేశంలో చర్చించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పరస్పర సహకారంతో కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు. ప్రజలను నేరుగా కలుసుకుని ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను కరపత్రాల ద్వారా వివరించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాలను కూడా తెలుసుకున్నారు.

## రూ.1.20 కోట్లతో కళాశాల భవనం



- ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రారంభం
- పునాదిపాడులో నూతన భవనం ప్రారంభం
- విద్యాభివృద్ధికి మరో ముందడుగు
- మంత్రి నారా లోకేశ్

పునాదిపాడు, జూలై 27 : కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలోని కంకిపాడు మండలం పునాదిపాడులో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల భవనాన్ని విద్య, సమాచార సాంకేతిక శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. పోలవరపు మాధవరావు, వారి కుటుంబ సభ్యులు రూ. 1.20 కోట్ల విరాళంతో ఈ భవనాన్ని నిర్మించి ప్రభుత్వానికి అందజేశారు. నూతన కళాశాల భవనం ప్రారంభం సందర్భంగా మంత్రి విద్యార్థినులతో ముచ్చటించి వారి విద్యా అవసరాలను తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రావడానికి ఆధునిక సౌకర్యాలతో కూడిన విద్యాసంస్థలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యాభివృద్ధిలో దాతల భాగస్వామ్యం ఆదర్శప్రాయమని కొనియాడారు. సామాజిక బాధ్యతతో విద్యారంగానికి విరాళాలు అందించే దాతలను ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని మంత్రి తెలిపారు. ప్రభుత్వంతో పాటు సమాజం కూడా విద్యాభివృద్ధిలో భాగస్వామ్యం కావడం వల్ల మెరుగైన మౌలిక వసతులు కల్పించే అవకాశం ఉంటుందని చెప్పారు. బాలికల ఉన్నత విద్యకు ఇలాంటి కార్యక్రమాలు మరింత దోహదపడతాయని అభి ప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మండలి ప్రధాన విప్ పంచుమర్తి అనూరాధతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఇతర అధికారులు పాల్గొన్నారు. కళాశాల భవన నిర్మాణానికి సహకరించిన దాతలను ప్రజాప్రతినిధులు అభినందించారు. నూతన భవనం అందుబాటులోకి రావడంతో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులకు మెరుగైన తరగతి గదులు, అవసరమైన విద్యా సదుపాయాలు లభించనున్నాయి. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల బాలికలకు నాణ్యమైన విద్య అందే అవకాశాలు మరింత విస్తరించనున్నాయని అధికారులు తెలిపారు. విద్యారంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రభుత్వం, దాతలు, ప్రజాప్రతినిధుల సమిష్టి సహకారంతో ప్రభుత్వ విద్యాసంస్థలను మరింత బలోపేతం చేసి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.



## ఆటో డ్రైవర్ల సమస్యలపై వినతి

- పల్లా శ్రీనివాసరావును కలిసిన సభ్యులు
- సంక్షేమ బోర్డు ఏర్పాటుకు విజ్ఞప్తి
- ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్న హామీ

విశాఖపట్నం, జూలై 27 : గాజువాక శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును 86 ఆటో స్టాండ్ యూనియన్‌కు చెందిన సుమారు 300 మంది సభ్యులు కలిసి తమ సమస్యలను వివరించారు. ట్రాఫిక్ చలానాలు అధికంగా విధించడం, ఆటో డ్రైవర్ల కోసం భవిష్య నిధి, ఉద్యోగుల రాష్ట్ర బీమా సౌకర్యాలతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రయాణికుల సేవల యాప్‌ను అందుబాటులోకి తీసుకురావడం వంటి పలు డిమాండ్లను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను యూనియన్ ప్రతినిధులు వివరించారు. ముఖ్యంగా ట్రాఫిక్ చలానాలు అధికంగా విధించడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. నిబంధనల అమలుతో పాటు డ్రైవర్ల పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసి భవిష్య నిధి, ఉద్యోగుల రాష్ట్ర బీమా వంటి సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అసంఘటిత రంగ కార్మికులుగా పనిచేస్తున్న ఆటో డ్రైవర్లకు సామాజిక భద్రత కల్పించే చర్యలు చేపట్టాలని కోరారు. ప్రైవేటు ప్రయాణికుల సేవల యాప్‌లకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్‌ను ప్రారంభించాలని యూనియన్ సభ్యులు కోరారు. అలాగే ఆటో డ్రైవర్ల అవసరాల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఈ చర్యలతో వారి ఉపాధి, ఆదాయం మెరుగుపడుతుందని అభిప్రాయపడ్డారు. ఆటో డ్రైవర్ల వినతులను పల్లా శ్రీనివాసరావు ఓర్పుగా విన్నారు. వారి సమస్యలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ట్రాఫిక్ పోలీసు అధికారులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి సానుకూల పరిష్కారం కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆటో డ్రైవర్ల సంక్షేమం, జీవనోపాధి పరిరక్షణకు ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

# ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలి





### అందిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్

పుట్టపర్తి, జూలై 27 అనంత సూర్య: ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు.సోమవారం పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను కలెక్టర్ స్వీకరించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు, వినతులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిశీలించి అర్హత మేరకు పరిష్కరించాలని అధికారులకు సూచించారు.ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు.ఈ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 332 అర్జీలు అందగా, వాటిని పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఎండార్స్ చేశారు.కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, డీఆర్వో కొండయ్య, ఎస్‌డీసీ విజయకుమారి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బీడీ కార్మికులకు సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి





### జూలై 31న కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ పిలుపు

కదిరి, జూలై 27 అనంత సూర్య: బీడీ కార్మికులకు ప్రత్యేక సంక్షేమ నిధి ఏర్పాటు చేసి, వెయ్యి బీడీలకు కనీస వేతనాన్ని రూ.475కు పెంచాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు.జూలై 31న పుట్టపర్తి జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయ వంతం చేయాలని కోరుతూ కదిరి నిజాంవలి కాలనీలో సోమవారం కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 18 ఏళ్లుగా బీడీ కార్మికులకు కనీస వేతనాలు సవరించలేదని, కదిరిలో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని, బీడీ కార్మికులకు గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. పొగాకు ఉత్పత్తులపై వచ్చే జీఎస్టీతో సంక్షేమ నిధి ఏర్పాటు చేసి కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, పెన్షన్లు అందించాలని, లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి బీడీ కార్మికుల సంక్షేమ చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎల్. నరసింహులు, పట్టణ కార్యదర్శి బాబ్జాన్, బీడీ కార్మిక సంఘం నాయకులు, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు పాల్గొన్నారు.

# ప్రజా పాలనకు సంపూర్ణ మద్దతు లభిస్తోంది

## ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్





### • ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన –ప్రజల సమస్యలపై ఆరా

ధర్మవరం, జూలై 27 అనంత సూర్య: కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనకు ప్రజల నుంచి విశేష ఆదరణ, సంపూర్ణ మద్దతు లభిస్తోందని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు.ధర్మవరం మండలం పోతులనాగేపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన 'ఇంటింటికీ కూటమి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి ఇంటిని సందర్శించి గత రెండేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు ప్రభుత్వ పథకాల పట్ల సంతృప్తి వ్యక్తం చేయగా, పింఛన్లు, 'తల్లికి వందనం' పథకానికి సంబంధించిన కొన్ని సమస్యలను పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకువచ్చారు.వాటిపై వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలోని ఇతర సమస్యలను కూడా ప్రజలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా వారి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. 45 రోజుల పాటు పార్టీ శ్రేణులు ప్రజల మధ్యే ఉండి ప్రతి ఇంటిని, ప్రతి ఓటరును కలిసి ప్రభుత్వ పనితీరును వివరించనున్నట్లు చెప్పారు.రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుభవంతో సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ పాలన సాగిస్తున్నారని, అందుకే ప్రజలు కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్నారని పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు.

# మెగా డీఎస్సీపై ఆరోపణలు కాదు.. రుజువులు చూపాలి: మంత్రి సవిత





### గిద్దలూరులో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం

గిద్దలూరు, జూలై 27 అనంత సూర్య : మెగా డీఎస్సీపై నిరాధార ఆరోపణలు చేయడం మానేసి, అక్రమాలు జరిగాయని చెబితే రుజువులు చూపించాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు రాష్ట్ర మంత్రి ఎస్. సవిత సవాల్ విసిరారు.సోమవారం గిద్దలూరు మున్సిపల్ పరిధిలోని రాజానగర్‌లో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డితో కలిసి 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 16 వేల ఉపాధ్యాయ పోస్టులతో డీఎస్సీ నిర్వహించిందని, ఎన్నికల హామీల అమలులో ముందంజలో ఉందన్నారు. పెన్షన్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, చేనేత కార్మికులకు 'నేతన్న సేవలో' పథకం వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు.బీసీ గర్జన పేరుతో వైసీపీ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు మరోసారి కూటమికే మద్దతు ఇస్తారని మంత్రి సవిత ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# ధర్మవరం నూతన డీఎస్పీగా బి.వి.జె. రాజు బాధ్యతల స్వీకరణ



### శాంతిభద్రతల పరిరక్షణకు తొలి ప్రాధాన్యం – ప్రజలకు మెరుగైన పోలీసు సేవలే లక్ష్యం

ధర్మవరం, జూలై 27 అనంత సూర్య: ధర్మవరం డివిజన్ నూతన డీఎస్పీగా బి.వి.జె. రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.ప్రజలకు సత్వర, పారదర్శక, నాణ్యమైన పోలీసు సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నేరాల నియంత్రణతో పాటు మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపడతామని చెప్పారు. ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేసి సహకరించాలని డీఎస్పీ బి.వి.జె. రాజు విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేస్తామని ఆయన అన్నారు.

# నిరుద్యోగ యువత సమస్యలపై మంగళవారం ధర్నా



### యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలి: ఊరువాకిలి సందీప్ నాయుడు

పుట్టపర్తి, జూలై 27 అనంత సూర్య: ఇటీవల నిర్వహించిన డీఎస్సీ పరీక్షలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని, విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన నెలకు ₹3,000 నిరుద్యోగ భృతిని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రంలో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం పుట్టపర్తి మున్సిపాలిటీ అధ్యక్షుడు ఊరువాకిలి సందీప్ నాయుడు తెలిపారు.మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి, పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా యువజన విభాగం, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ ధర్నా కార్యక్రమానికి యువత, విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఊరువాకిలి సందీప్ నాయుడు పిలుపునిచ్చారు..

# కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలికలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు

పుట్టపర్తి, జూలై 27 అనంత సూర్య: వైద్య ఆరోగ్యశాఖలో గత కొన్ని సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగుల ఐదు ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్‌కు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించినప్పటికీ ఉద్యోగ భద్రత కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం, అప్పటి వరకు 100 శాతం గ్రాస్ వేతనం చెల్లించడం, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగి కుటుంబానికి ₹50 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబ సభ్యుడికి ఉద్యోగం, అనారోగ్యంతో ఉన్న ఉద్యోగులకు పూర్తి వేతనంతో సెలవులు, హెల్త్ కార్డు సౌకర్యం, అలాగే రిక్వెస్ట్, మ్యూచువల్ బదిలీలకు అవకాశం కల్పించాలని వినతిపత్రంలో కోరారు.ఈ కార్యక్రమంలో కొత్తచెరువు సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)కు చెందిన సవిత, సుమ, శివమ్మ, చరణ్, రాకుమార్, చంద్రకళ తదితర కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.



# పంపనూరులో వరుణ హోమం.. సహస్ర ఘటాభిషేకం





అనంతపురం, జూలై 27 అనంత సూర్య : అనంతపురం జిల్లాలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పంపనూరు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో అత్యంత భక్తి శ్రద్ధలతో, శాస్త్రోక్తంగా వరుణయాగం నిర్వహించారు. గత కొన్ని రోజులుగా ఎల్-నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పంపనూరు క్షేత్రంలో "వరుణహోమం" – "సహస్ర ఘటాభిషేకం" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దేవాలయం నుంచి పవిత్ర జలాలను తీసుకొని గ్రామ బొడ్డు రాయి దగ్గరికి ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం బొడ్డు రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి, శ్రీ పరమేశ్వరునికి, శ్రీ పార్వతి అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల మధ్య సహస్ర ఘటాభిషేకం చేశారు. ఆలయంలో వెయ్యి కలశాలతో అభిషేకం చేశారు. పవిత్ర నదీ జలాలు, మంత్రాలతో అభిమంత్రించిన నీటిని వెయ్యి కలశాలలో నింపి.. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి అభిషేకం చేశ-ారు. ఆ తర్వాత లోక కల్యాణం కోసం, వర్షాలు బాగా కురవాలని, దేశం సుభిక్షంగా ఉండాలని వరుణ హోమం నిర్వహించారు. వర్షాలు బాగా కురవాలని, నీటి కటకటలు తొలగిపోవాలని హోమం చేశారు. వేద మంత్రాలు పఠిస్తూ అగ్నిలో నెయ్యి, ధాన్యం, ఇతర ద్రవ్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్వయంగా పాల్గొని గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాలు బాగా కురవాలని ఆకాంక్షించారు. ఇప్పటికే ఎల్-నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురవకపోవడం వలన రైతులు ఆందోళనలు చెందుతున్నారన్నారు. రిజర్వాయర్లలో కూడా నీరు అనుకున్నంత మేర రావడం లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అత్యంత పవిత్రమైన పంపనూరులో వరుణయాగం, సహస్ర ఘటాభిషేకం కార్యక్రమాలు నిర్వహించినట్టు



తెలిపారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కృప వలన వర్షాలు బాగా కురవాలని.. పంటలు బాగా పండి రైతులు సంతోషంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు.

## 33-శాతం మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్‌కోటా తేల్చాలి

### – బీసీ సంక్షేమ సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షుడు భాస్కర్ బాబు

అనంతపురం, జూలై 27 అనంత సూర్య : చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నప్పటికీ, ఆ రిజర్వేషన్లలో బీసీ మహిళలకు ప్రత్యేక సబ్‌కోటా కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షుడు విబి భాస్కర్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ బాబు మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు వాటా నిర్ధారించాలని ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరారు. 1996 నుంచే బీసీ మహిళల ఉప కోటా అంశం వివాదాస్పదంగా మారి బిల్లులు నిలిచిపోయాయని, అప్పటి నుంచి దేశవ్యాప్తంగా ఓబీసీ, మహిళా సంఘాలు నిరంతరం పోరాటాలు చేస్తున్నాయని పేర్కొన్నారు.




2023లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందినప్పటికీ, ఓబీసీ మహిళల అంశం ఇంకా స్పష్టత పొందలేదని ఆయన విమర్శించారు. బీసీ మహిళలకు సబ్‌కోటా లేకుండా రిజర్వేషన్లు అమలు చేయడం సామాజిక న్యాయానికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. మహిళలు సాధారణంగా వెనుకబడ్డ వర్గమైతే, బీసీ మహిళలు మరింత వెనుకబడిన వర్గంగా ఉన్నారని ఆయన తెలిపారు. ఆధిపత్య వర్గ మహిళలతో పోటీ పడటం బీసీ మహిళలకు కష్టమని, అందువల్ల ప్రత్యేక ఉపకోటా అవసరమన్నారు. మొత్తం మహిళా రిజర్వేషన్లలో కనీసం మూడో వంతు, అంటే స-ుమారు 11 శాతం బీసీ మహిళలకు కేటాయించాలని భాస్కర్ బాబు సూచించారు. ఈ నిర్ణయం బీసీ మహిళల సాధికారతకు కీలకమవుతుందని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎసఆర్ నాగభూషణం, రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర గౌడ్, స్వర్ణకార సంఘం కార్యదర్శి ముష్టూర్ శ్రీనివాస్ ఆచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు కేశవ్ కుమార్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మనోజ్ కుమార్, విద్యార్థి నగర అధ్యక్షుడు భరత్ యాదవ్, గురు, ముఖేష్, సాయి, బీసీ నాయకులు పాల్గొన్నారు.





# అమరావతి చాంఫియన్ షిప్-2006లో ఎమ్మెల్యే సందడి



## విద్యార్థులతో కలిసి క్రీడల్లో పాల్గొని ఉత్సాహపరిచిన ఎమ్మెల్యే దగ్గుపాటి

***అనంతపురం, జూలై 27 అనంత సూర్య :***

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్‌షిప్-2026 కార్యక్రమంలో భాగంగా అనంతపురంలోని ఆర్ట్స్ కాలేజ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి వివిధ క్రీడా అంశాల్లో పాల్గొని వారిని ఉత్సాహపరిచారు. విద్యతో పాటు క్రీడలు కూడా విద్యా ర్థుల సమగ్ర వికాసానికి ఎంతో అవసరమని ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని చెప్పారు. ప్రతి విద్యార్థి క్రీడలను జీవితంలో భాగంగా చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణస్థాయి నుంచే ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు అమరావతి ఛాంపియన్ షిప్‌ను నిర్వహిస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విద్యార్థులతో కలిసి క్రీడల్లో పాల్గొనడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేయగా, క్రీడా ప్రాంగణంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## సంక్షేమ వసతి గృహాలకు కెఎస్‌హెచ్ ఆటోమోటివ్ సంస్థ సాయం

### సీఎస్ఆర్ నిధులతో స్మార్ట్ టీవీలు, లైబ్రరీ ర్యాకుల పంపిణీ




పుట్టపర్తి, జూలై 27 అనంత సూర్య: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా పెనుగొండకు చెందిన కెఎస్‌హెచ్ ఆటోమోటివ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలకు స్మార్ట్ టీవీలు, లైబ్రరీ ర్యాకులను అందించింది. సోమవారం పుట్టపర్తి రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ధర్మవరం, పెనుగొండ డివిజన్ల పరిధిలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖలకు చెందిన 10 వసతి గృహాలకు 43 అంగుళాల స్మార్ట్ టీవీలను జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ సంబంధిత అధికారులకు అందజేశారు. మొత్తం 25 కళాశాల వసతి గృహాలకు లైబ్రరీ ర్యాకులు, 20 స్మార్ట్ టీవీలు అందజేయనున్నట్లు తెలిపారు. విద్యార్థుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధికి సహకరిస్తున్న కెఎస్‌హెచ్ ఆటోమోటివ్ సంస్థ యాజమాన్యాన్ని జిల్లా కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాజేంద్ర కుమార్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ధర్మవరం నూతన డీఎస్పీ



పుట్టపర్తి, జూలై 27 అనంత సూర్య: ధర్మవరం సబ్‌డివిజన్ నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన బి.వి. జగన్నాథ్ రాజు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఐపీఎస్ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి బదిలీపై వచ్చిన జగన్నాథ్ రాజుకు ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. ధర్మవరం సబ్‌డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతమైన పోలీసింగ్ అందించాలని ఎస్పీ ఆదేశించారు.

## జూలై 31 లోగా పంటల బీమాలో చేరాలి

### రైతులకు జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ విజ్ఞప్తి



పుట్టపర్తి, జూలై 27 అనంత సూర్య: జిల్లాలోని రైతులందరూ ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ సూచించారు. వాతావరణ ఆధారిత పంటల బీమా, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో చేరేందుకు జూలై 31 వరకు మాత్రమే గడువు ఉందని తెలిపారు. వాతావరణ ఆధారిత బీమా కింద వేరుశనగ, పత్తి, చీనీ, దానిమ్మ, టమాటా పంటలు ఉండగా, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద కంది, మొక్కజొన్న, ఆముదం, రాగి, వరి పంటలు ఉన్నాయని పేర్కొన్నారు. గడువు ముగియడానికి కేవలం నాలుగు రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున రైతులు వెంటనే ప్రీమియం చెల్లించి బీమాలో నమోదు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. పంటల బీమాకు సంబంధించి సందేహాలు లేదా సమస్యలు ఉంటే సంబంధిత మండల వ్యవసాయ అధికారులను లేదా జిల్లా వ్యవసాయశాఖ కంట్రోల్ రూమ్ 83310 57715 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## ఇఫియా జాతీయ ఉపాధ్యక్షునిగా వెంకటరెడ్డి



అనంతపురం, జులై 27 అనంత సూర్య : ఏపీటీఎఫ్ 1938 ఉపాధ్యాయ సంఘం లో అనంతపురం జిల్లా అధ్యక్షునిగా, రాష్ట్ర కార్యదర్శిగా, జిల్లా ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ గా పనిచేసిన కొలుకుల వెంకటరెడ్డి అంతర్జాతీయ సంస్థ ఐక్యరాజ్య సమితిలో భాగమైన యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్ సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ ( యునెస్కో), ఎడ్యుకేషనల్ ఇంటర్నేషనల్ (ఈఐ) లలో సభ్య సంఘంగా, ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (1938) అనుబంధ సంఘంగా కలిగి ఉన్న ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎడ్యుకేషనల్ అసోసియేషన్స్ ( ఐఫియా ) కు ఆంధ్రప్రదేశ్ నుంచి జాతీయ ఉపాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు ఏ పి టి ఎఫ్ 1938 నాయకులు అభినందనలు తెలుపుతూ.. వెంకటరెడ్డి మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి విద్యా రంగానికి, ఉపాధ్యాయ సంక్షేమానికి పాటుపడాలని ఆకాంక్షించారు.

అనంత సూర్య
తెలుగువార్త
మంగళవారం 28 జూలై 2026


# ప్రభుత్వ ఆసుపత్రిలో

## చిన్న పిల్లలకు బేబీ కిట్ల పంపిణీ



అనంతపురం, జులై 27 అనంత సూర్య : నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్పర్సన్ డాక్టర్ నిర్మలమురళి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెన్డెంట్ డాక్టర్ మల్లీశ్వరి చేతుల మీదగా చిన్నారులకు బేబీకిట్ల పంపిణీ చేశారు. సోమవారం ట్రస్టు సభ్యులు కల్లుమడి రవీంద్రనాథ్ సతీమణి రమాదేవి పుట్టినరోజు, అలాగే మా తమ్ముడు శివరాజ ప్రసాద్, శశికళ దంపతుల కుమార్తె నిర్విఘ్న సాయి పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమానికి సహాయం అందించారని తెలిపారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో అప్పుడే పుట్టిన చిన్న పిల్లలకు బేబీ దుస్తులతో పాటు 5 రకాల వస్తువులను అందించామన్నారు. దాదాపు 40 మంది చిన్నారులకు బేబీ కిట్లు అందించామని తెలిపారు. అవసరంలోనూ ఆపదలోనూ ఉన్నవారికి వీలున్న ప్రతి ఒక్కరూ ఏదో ఒక రూపంలో సహాయం చేయాలని కోరారు. ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు, చిన్న పిల్లలకు, విద్యార్థుల చదువుకు ఇలా అనేక విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. ట్రస్ట్ నిర్వహణకు కృషి చేస్తున్న దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, శారద బుక్ స్టాల్ యజమాని శివ రాజ ప్రసాద్, డాక్టర్ శ్రీహరిని, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# SR గంగా.. నిజంగా!




- వసూళ్లలో ఎన్ని కళలో !
- విద్యార్థుల నుండి రకరకాల పేర్లతో వసూళ్లు
- కాసుల వ్యామోహంలో ఆర్ఐఓ ?
- నీటి బుడగల్లా.. విద్యార్థి నేతలు ఆందోళనలు
- పై ఫీజులు కట్టలేక ఇబ్బంది పడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- ఎమ్మెల్యే, కలెక్టర్ చొరవతోనే.. సమస్యలకు పరిష్కారమంటున్న మేధావులు

**అమ్మో.. ఆ పేరు ఎంతో పవిత్రం. చాలా మంది సమాజంలో ఆ పేరుకు తగ్గట్టుగానే మంచి గుణగణాలతో ఎందరికో సహాయం చేస్తుంటారు. అయితే అనంతపురం పరిధిలోని ఎస్ఆర్ కళాశాలకు చెందిన ఓ ప్రిన్సిపల్ గంగా.. నిజంగా అక్రమ వసూళ్లలో పలు రకాల కళలతో అంతటా చర్చించుకునే రేంజ్‌కి ఎదిగిపోయిందట గుత్తి రోడ్డులోని ఆ ప్రిన్సిపల్ భవాని తీరు. విద్యార్థుల తల్లిదండ్రుల నుండి నాణ్యమైన విద్యా, వసతులు అంటూ.. ఈమె చేస్తున్న వసూళ్లు చూస్తే ఎవరికైనా దిమ్మతిరగాల్సిందేనట.**

*అనంతపురం, జూలై 27 అనంత సూర్య :*

### విద్యార్థి నేతలు ధర్నాలు చేస్తున్నా.. కాసుల వ్యామోహంలో ఆర్ఐవో ?

వేడినీళ్ల పేరుతో వ్యాపారం, దోబీ పేరుతో దోచుకు తినడం, తాగే మంచినీళ్లకు కూడా వెలకట్టి వసూళ్లు, ముద్రించిన పాఠ్యపుస్తకాలు, విద్య సామాగ్రి నిబంధన విరుద్ధంగా అమ్మకాలు జరుపుతూ.. లెక్కకు మించినంత వసూళ్లు, హాస్టల్‌కు అనుమతి లేకున్నా, అక్కడ ఆమె నిర్ణయించిన మొత్తం చెల్లించాల్సిందే. డిపాజిట్ పేరుతో, పాకెట్ మనీ పేరుతో, కళాశాలలో పుస్తకాల అమ్మకం ధరలు కళ్ళు తిరగాల్సిందే.




పక్కా ఆధారాలతో ఆ కళాశాల ప్రిన్సిపల్ చేస్తున్న అక్రమ వసూళ్లను జిల్లా విద్యాశాఖ ఆర్ఐఓకి విద్యార్థి సంఘం నాయకులు ఆందోళనలతో కూడిన ఆధారాల వినతి పత్రాన్ని సమర్పించినా.. ఏ ప్రయోజనం లేకుండా పోతుందట. ఇక్కడి ఆర్ఐఓ వ్యవహారం ఈ ఒక్క కళాశాలే కాకుండా ఆయన పరిధిలోని అన్ని కళాశాలల వద్ద నెలసరి, ఏడాది మామూళ్లు, పలు రకాల విందులు, వినోదాలు, ఆయా కళాశాల యాజమాన్యం ఇచ్చే ఆదిత్యాలను పుచ్చుకుంటూ కాసులతో కళ్ళు మూసుకున్నారన్న బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి.

### ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ చొరవపైనే తల్లిదండ్రుల ఆశలు :

ఎడపెడా విద్య, వసతి పేరుతో ఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగా వసూలు చేస్తున్న అక్రమ ఫీజుల దందాపై స్థానిక ప్రజాప్రతినిధి దగ్గుబాటి ప్రసాదు, జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ చొరవ చూపి, ఆయా కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా విద్యార్థులను, ఆ కళాశాల యాజమాన్యపు అక్రమ ఫీజుల వసూళ్ల నుండి కాపాడాలని పలువురు నగర ప్రముఖులు, విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

## 2 ఏళ్ల పాలనపై..

# ప్రజల హర్షాతిరేకాలు

- ఎమ్మెల్యే దగ్గుపాటికి తొలిరోజు అనూహ్య స్పందన
- ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే
- భారీ గజమాలతో స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు
- జిల్లా అధ్యక్షుడితో కలిసి ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే దగ్గుపాటి
- ప్రజల్లోకి వచ్చి మా పాలనకు వస్తున్న స్పందన చూడాలన్న దగ్గుపాటి ప్రసాద్

**అనంతపురం, జూలై 27 అనంత సూర్య :**

కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన కనిపించింది. అనంతపురం నగరంలోని పాతూరులోని కనకదాసు విగ్రహం వద్ద నుంచి ఈ కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, కూటమి పార్టీల నాయకులలు పాల్గొన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున



తరలివచ్చి ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కనకదాసు విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. భారీ గజమాలతో ఆయన్ని సత్కరించారు. అనంతరం ఆయన అన్ని వర్గాల ప్రజలను కలుస్తూ ముందుకు సాగారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సంక్షేమ పథకాలు అందాయి.. నగరంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి మీ స్పందన ఏంటన్నది ఎమ్మెల్యే దగ్గుపాటి తెలుసుకున్నారు.

ఇంటింటికి వెళ్తూ ఆయన రెండేళ్లలో చేసిన కార్యక్రమాల గురించి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. గొడ్డలి పార్టీ పాలనలో జగన్మోహన్ రెడ్డి గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిపోతే ఏడాదిలోపే మళ్ళీ రాష్ట్రాన్ని గాడిలో పెట్టినట్లు వివరించారు. రెండేళ్లలోనే ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు. మొదటి ఐదు సంతకాల్లోనే మెగా డీఎస్సీ, అన్నా క్యాంటీన్లు, పింఛన్ల పెంపు, ల్యాండ్ టైటిల యాక్ట్ రద్దు, యువతకు నైపుణ్యాలు పెంచే కార్యక్రమం వంటి హామీలను నెరవేర్చినట్లు తెలిపారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆటో డ్రైవర్లకు 15 వేలు, అన్నదాత సుఖీభవ అమలు చేశారన్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం ఇచ్చామని.. జగన్ రెడ్డి పుస్తకాలు, బెల్టులపై తన పేర్లు వేసుకుని తుగ్లక్ మామయ్యగా మారాడని విమర్శలు చేశారు. గతంలో హంద్రీనీవా ప్రాజెక్టును ఎన్టీఆర్ ప్రారంభిస్తే.. దానిని పూర్తి చేస్తున్నది ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 1800 క్యూసెక్కులు ఉన్న ప్రవాహాన్ని 3500 కోట్లు ఖర్చు పెట్టి 100 రోజుల్లోనే 3800 క్యూసెక్కుల పెంచారన్నారు. ఇటు తమిళనాడు బార్డర్‌లో ఉన్న కుప్పానికి అటు కర్ణాటక బార్డర్‌లో ఉన్న మడకశిర వరకు నీరు తీసుకెళ్తున్నారన్నారు. 350 కోట్లతో రైతులకు డ్రిప్పు, స్ప్రింక్లర్లు ఇచ్చారన్నారు. ఈ రెండేళ్లలో తాము చేసిన అభివృద్ధి, సంక్షేమంపై ప్రజలు ఏమంటున్నారో వైసీపీ నాయకులు వచ్చి తెలుసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.

ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, సంగా తేజస్విని, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, బిజెపి నాయకుడు అశోక్, మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాయల్ మురళి, డివిజన్ ఇంచార్జ్ కుళ్ళాయిస్వామి, టిడిపి జిల్లా కమిటీ నాయకులు కొనంకి గంగారాం, కంతాదేవి, దబ్బర కుమారస్వామి నాయుడు, కార్పొరేషన్ డైరెక్టర్లు రంగాచారి, పిఎల్ఎన్ మూర్తి, పరమేశ్వర్, కడియాల కొండన్న, బెస్త పవన్ కుమార్, పోతుల లక్ష్మీనరసింహులు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అర్షదుల్లా, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, టిడిపి నాయకులు పావురాల శేఖర్, సుంకన్న, సింగవరం రవి, తోండపునాటి రమేష్, నెట్టెం బాలకృష్ణ, రాయల్ మధు, చేపల హరి తదితరులు పాల్గొన్నారు.



# కరువు జిల్లాలో 50శాతం తగించాలి..

## - విద్యార్థి నేత అమర్ యాదవ్



అనంతపురం, జూలై 27 అనంత సూర్య : కరువు జిల్లాలో కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థలలో 50శాతం ఫీజులలో రాయితీ కనిపించాలని ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్ జేఏసీ నేతలు సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి జేఏసీ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్ మాట్లాడుతూ.. యూకేజీ, ఎల్కేజీ, నర్సరీలకు ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎలా విద్యాసంస్థలు నడుపుతారని కార్పొరేట్ వ్యవస్థను ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలో ఉన్న 'ది ట్రేలిస్, నారాయణ, శ్రీచైతన్య, భాష్యం, కేశవ రెడ్డి, ఎడిఫై, సంసిద్ తదితర విద్యాసంస్థల యాజమాన్యం యూకేజీ, ఎల్కేజీ, నర్సరీలకు 65 వేల నుంచి 85 వేల రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా ప్రభుత్వ జీవో నెంబర్ 01 ప్రకారం కార్పొరేట్, ప్రవేట్ విద్యాసంస్థల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ షూ, బ్లేజర్ వంటి ఇతర రకాల పరికరాలు విద్యార్థులకు అమ్మకూడదు, కానీ ఈ విద్యాసంస్థల యాజమాన్యం ప్రభుత్వ నిబంధన వ్యతిరేకంగా బయట మార్కెట్ ధరలు కంటే నాలుగు రేట్లు అధికంగా పుస్తకాల అమ్ముతూ.. విద్యార్థులు తల్లిదండ్రులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో కార్పొరేట్ విద్యా సంస్థలకు ప్రభుత్వ నుంచి గుర్తింపు లేకుండా పాఠశాలలు, కాలేజీ నడుపుతున్నారని ఫిర్యాదుల పేర్కొన్నారు. ఇదే అంశంపై డీఈఓ, ఆరఐఓ ఎన్నిసార్లు



ఫిర్యాదు చేసినా.. పట్టించుకోలేదని అధికారులపై ఫిర్యాదు చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులను పిలిపించి మాట్లాడి ఏవైతే ప్రభుత్వం నిబంధనలకు వ్యతిరేకంగా విద్యాసంస్థలు అడుగుతున్నారో, వాటిపై చర్యలు తీసుకుంటామని జేసీ విద్యార్థి నేతలకు తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారిలో బీసీ రాజేష్, మండ్లే విజయ్, ప్రశాంత్, కాశీ తదితరులు పాల్గొన్నారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405